క్లుప్తంగా

పేదలకు దుప్పట్లు పంపిణీ



చిలకలూరిపేటటౌన్: యంగ్‌మాన్ క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చిలకలూరిపేట మండలం దండమూడి గ్రామం దళిత వాడలోని నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ జరిగింది. ఆ సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ చుక్క విన్సెంట్‌పాల్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ఆర్సీయం చర్చి ఫాదర్ మరియదాసు పాల్గొని మాట్లాడారు. అనంతరం 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు కె. రామ్మోహన్‌రావు, సిస్టర్ సుపీరియర్ సుందరి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కందిలో పురుగు నివారించాలి



శావల్యాపురం: మండలంలోని పోట్లూరు, ఇర్లపాడు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు మాట్లాడుతూ కంది పైరు పూత దశలో ఉందని పురుగు ఎక్కువగా ఉంటే ఇండాక్సాకార్బ్ 200 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. మిరప పంటలో బులుగు, తెలుపు, పసుపు రంగుల అట్టలను నల్లి ఉధృతికి తెలుసుకోవడానికి ముందుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే పీఎం కిసాన్ యోజన ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న వారు ఆధార్‌కు బ్యాంకు లింకు కాని వారు పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి అశోక, వీఏఏ శివనాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నూజెండ్లలో ఫించనుదారుల పరిశీలన



వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక భద్రత పెన్షన్లలో అనర్హుల గుర్తింపుతో పాటు పునఃపరిశీలన కార్యక్రమం నూజెండ్ల మండలంలో శుక్రవారం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు నెలకు రూ. 15 వేల పింఛను పొందుతున్న అనారోగ్య దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ పూర్తి స్థాయిలో మంచంలో ఉన్న లబ్ధిదారులను మాత్రమే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసినట్లు వైద్య బృందం సభ్యులు తెలిపారు. ఈవిధంగా పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు 14 మంది ఉండగా వైద్య బృందం సభ్యులు నేరుగా పింఛనుదారుల ఇళ్లకు వెళ్ళి పరిశీలించారు. వైద్య బృందం సభ్యులు విజయవాడ జీజీహెచ్ డాక్టర్ వరుణ్‌కుమార్, గుంటూరు జీజీహెచ్ వైద్యులు రోశయ్య, నూజెండ్ల వైద్యశాల వైద్యులు పుష్పేంద్ర, డిజిటల్ అసిస్టెంట్ అమిత్‌మోహన్ తదితరులు ఉండగా నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



నరసరావుపేట రూరల్: రహదారి భద్రతా నియమాలు వాహనచోదకులు తప్పనిసరిగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శివనాగేశ్వరరావు తెలిపారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం భారీ వాహన డ్రైవర్లకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారుడు, వెనుక కూర్చున్న వ్యక్తి హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. రహదారి ప్రమాదాల్లో హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. మితిమీరిన వేగంగా వాహనాలను నడపడం ద్వారా యువత ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు.
రహదారి ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా చిన్నాభిన్నమై తీవ్ర ఇబ్బందులు పడుతుందని తెలిపారు. ప్రతి ఏటా నమోదయ్యే మరణాల్లో 40 శాతం రోడ్డు ప్రమాదాలే అని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవీఐలు ఎస్.శ్రావ్య,ఎంఎల్ఎన్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహాన్ని నింపిన..

కబడ్డీ పోటీలు



- అరేపల్లి ముప్పాళ్ళలో నువ్వా-నేనా అన్న రీతిన తలపడిన 50 జట్లు
- ఆరు రోజులుగా గ్రామంలో సత్తాచూపుతున్న క్రీడాకారులు
- ప్రైజ్ మనీకి 12 జట్లు అర్హత



కబడ్డీ పోటీలను తిలకిస్తున్న ముప్పాళ్ళ ప్రజానీకం

ఈపూరు (శావల్యాపురం): ఈపూరు మండలం అరేపల్లి ముప్పాళ్ళ గ్రామంలో ఆరు రోజులుగా జరుగుతున్న కబడ్డీ పోటీలు అందరిలోనూ ఉత్సాహాన్ని నింపుతున్నాయి. 33 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో ఈ పోటీలను రైతుమిత్ర కమిటీ సభ్యులు గ్రామస్తులు దాతల సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, హర్యానా, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, ముంబాయి, తదితర రాష్ట్రాల నుంచి 18 జట్లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నుంచి 32 జట్లు వివిధ ప్రాంతాల నుంచి పోటీలకు హాజరయ్యారు. ఇప్పటికే ఈ పోటీల్లో ప్రైజ్ మనీకి 12 జట్లు అర్హత పొందాయి. నాలుగు జట్లు ఇండియా నావీ, స్టార్స్ ఆంధ్రప్రదేశ్, బీఎంటీఎస్ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల జట్లు సెమీ ఫైనల్స్ వచ్చాయి. ప్రథమ బహుమతి రూ. 3 లక్షలు, రెండో బహుమతి రూ.2 లక్షలు, మూడో బహుమతి రూ.లక్ష నగదు విజేతలకు అందజేస్తారు. నాల్గవో బహుమతి రూ. 70 వేలు, అయిదో బహుమతి రూ. 50 వేలు, ఆరో బహుమతి రూ. 40 వేలు, ఏడో బహుమతి రూ. 20 వేలు, వరుసగా తొమ్మిది నుంచి 12 వరకు ఎంపికైన ఒక్కో జట్టుకు రూ.15 వేలు అందజేస్తారు. బెస్ట్ రైడర్ బెస్ట్ డిఫెండర్, మ్యాన్ ఆఫ్‌ది టోర్నీ, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ బహుమతులు కూడా ఇవ్వనున్నారు.

ముప్పాళ్ల కీర్తిని పెంచుతున్నాం



సంక్రాంతి పర్వదినం సందర్భంగా 33వ రైతుమిత్ర కమిటీ సభ్యులు గ్రామస్తులు దాతల సహకారంతో జాతీయ స్థాయి కబడ్డీ ఓపెన్ టోర్నమెంటు పోటీలు జరుపుతున్నాం పార్టీలకు కులమతాలకు అతీతంగా అందరి సహకారంతో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి ముప్పాళ్ళ గ్రామ కీర్తిని భారతదేశస్థాయిలోకి తేవటం మా లక్ష్యం.

–తల్లపనేని రామారావు, రైతుమిత్ర ప్రతినిధి

పదేళ్లుగా పాల్గొంటున్నా



జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో గత 10 సంవత్సరాల నుంచి పాల్గొంటున్నా. టోర్నమెంటు పోటీల్లో అందరి సహకారం బాగా ఉంది. మాకు రూ. 50 వేలు ప్రైజ్ నగదు రావటం టీం సభ్యులు ఐక్యంగా ఆడటానికి నిదర్శనం.

–సుమంత్, కబడ్డీ ప్లేయర్, విజయవాడ

మట్టిలో ఆట అద్భుతం



మట్టిలో కబడ్డీ పోటీలు జరపటం చాలా బాగుంది. మ్యాట్‌పై ఆడే దాని కన్నా మట్టిలో ఆట ఆడేలా కల్పించటం నాకు మంచి అనుభూతిని ఇచ్చింది. కొన్ని సంవత్సరాల నుంచి పోటీలను తిలకించటానికి 500 కిలోమీటర్ల దూరం నుంచి ముప్పాళ్ల వస్తున్నా.

–వెంకట చలపతి రెడ్డి, క్రీడా అభిమాని, తెలంగాణ

ఏర్పాట్లు బ్రహ్మాండం



నేను జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో 8 సంవత్సరాల నుంచి పాల్గొంటున్నా. టీం సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహణ బాగా చేశారు. భోజన వసతి రవాణా చార్జీలు తదితర ఏర్పాట్లు బాగా చేశారు. ఉదయం అల్పాహారం మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యాలు నిర్వహణ సంతృప్తిగా ఉన్నాయి.

–అభిషేక్ కుమార్, జార్ఖండ్ కబడ్డీ టీం

మరుపురాని అనుభూతి



నేను గత నాలుగు సంవత్సరాల నుంచి కబడ్డీ పోటీలలో పాల్గొంటున్నా . మేము తినే ఆహారాన్ని చపాతి, రొట్టె, పాలు, పెరుగు కూరలతోపాటు ఇష్టమైన వంటకాలు తయారు చేసి పెట్టారు. దక్షిణ భారతదేశ క్రీడల్లో నేను నాలుగు సార్లు పాలొన్నా. కానీ ముప్పాళ్ళలో నిర్వహించిన ఈ పోటీలు జీవితంలో మరుపురానివి.

–కమల్, పంజాబ్ కబడ్డీ టీం

నేడు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

చిలకలూరిపేట: పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు కోరారు. ఏటా 12 నెలల కాలానికి 12 లక్ష్యాలతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని శుభ్ర ప్రారంభం శనివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ముగిసిన చందవరం క్రికెట్ ప్రీమియర్ లీగ్



నాదెండ్ల: చందవరం గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన చందవరం క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ప్రథమ బహుమతిని చందవరం ఫ్రెండ్ సీసీ జట్టు కైవసం చేసుకుని రూ.20116లు నగదు, షీల్డ్ సాధించారు. ద్వితీయ బహుమతిని బుక్కాపురం పవర్ హిట్టర్స్ టీం సాధించి రూ.15116లు, షీల్డ్ అందుకున్నారు. తృతీయ బహుమతి ఇర్లపాడు రైజింగ్ స్టార్స్ దక్కించుకుని రూ.7116లు నగదు, షీల్డ్ అందుకున్నారు. నాలుగో బహుమతి సాతులూరు సీసీ హనుమాన్ జట్టు గెలుపొందింది. నిర్వాహకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వంకా కార్తీక్‌రెడ్డి, యన్నం చిన్నపుల్లారెడ్డి, ఆర్ఎంపి వైద్యులు చూపాటి బొల్లయ్య, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాటల్లోనే పరిశుభ్రత?!



నూజెండ్లలో రోడ్డు పక్కనే పడవేసిన వ్యర్థాలు



మూలన పడేసిన చెత్త సేకరించే రిక్షా

వినుకొండ (నూజెండ్ల): పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ వట్టి మాటలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. మండలంలోని గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత కనుచూపుమేరలో కనిపించటం లేదు. మండల కేంద్రమైన నూజెండ్లలో లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సంపద చెత్త కేంద్రం నిరుపయోగంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో గ్రామంలో చెత్త చెదారం నిల్వలు పెరిగిపోయాయి. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించాల్సిన గ్రీన్ అంబాసిడర్‌లపై అధికారుల అజమాయిషీ లేకపోవటంతో వారు విధులు పూర్తిస్థాయిలో నిర్వహించటం లేదని ప్రజలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెత్త సేకరించే రిక్షాలు మూల పడేశారు. ఇటీవల గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త తొట్లు సైతం నిండిపోయి దుర్గంధభరితంగా మారిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా మూడో శనివారం చేపడుతున్న స్వచ్ఛదివస్ కార్యక్రమం ద్వారా పంచాయతీ అధికారులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మార్చి 31లోగా పన్నులు వసూలు చేయాలి


- 100 శాతం లక్ష్యంగా పనిచేయాలి
- కమిషనర్ సూచన



మాట్లాడుతున్న కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట: పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పన్నులు ప్రతి ఒక్కరూ మార్చి 31వ తేదీ లోగా 100శాతం చెల్లించే విధంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ అతిథి గృహంలో సచివాలయ పరిపాలనా కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారితో పన్నుల వసూలుపై సమీక్ష చేశారు. ఆస్తి, ఖాళీస్థలాలు, నీటి పన్నులు బకాయిలు ఉన్న ప్రతి అసెస్‌మెంట్ యజమాని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నూతనంగా నిర్మించిన, పాతభవనాలపై అదనంగా నిర్మించిన నిర్మాణాలను గుర్తించి పన్నులు విధించాలని సూచించారు. రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బెయిలీబాబు, సయ్యద్ జహంగీర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమేదీ!



అచ్చంపేట మెయిన్ రోడ్డులో వాహనాల రాకపోకలు

అచ్చంపేట: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. వాహనాల రద్దీ ఎక్కువైంది. రోడ్డు మార్జిన్లలో తోపుడు బండ్ల వ్యాపారాలతో పాటు.. రోడ్డు పైనే ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలుపుదల చేయడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఓవర్‌లోడ్‌తో.. ఆడియో స్పీకర్ల అధిక సౌండ్‌తో ఇసుక ట్రాక్టర్లు ఎక్కువయ్యాయి. బ్యాంకుల ముందు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డు పైనే బ్యాంకు ఖాతాదారులు తమ వాహనాలను నిలుపుతున్నారు. పాఠశాల, ఉద్యోగాలకు వెళ్లి వచ్చే సమయాలు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచపోతున్నాయి. సత్తెనపల్లి రోడ్డులో ఆంజనేయస్వామి విగ్రహం నుంచి పంచాయతీ ఆఫీసు వరకు, అమరావతి రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి కొఠారు సెంటరు వరకు ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఉంది. 23 గ్రామ పంచాయతీల నుంచి అచ్చంపేటకు నిత్యం రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్ కార్యాలయాలకు గ్రామస్తులు ఏదో ఒక పనిమీద వచ్చిపోతుంటారు. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు కూడా సమయపాలన లేక పోవడంతో గంటల కొద్ది రోడ్డుపై ప్రయాణికులు వేచి ఉంటున్నారు. మాదిపాడు, పుట్లగూడెం బల్లకట్ల ద్వారా నిత్యం లారీలు అధిక లోడుతో వేగంగా వస్తున్నాయి. అల్పాహారం కోసం అచ్చంపేటలో సరైన స్థలం రోడ్డులోనే బస్సు నిలుపుకోవాల్సి వస్తోందని ఆర్టీసీ డ్రైవర్లు చెబుతున్నారు. రోడ్డు ఆక్రమణలు కూడా అధికంగానే ఉన్నాయి. ఇళ్ల ముందు ఉన్న స్థలం ఆక్రమించుకుని మెరకలు పోసుకోవడం, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునేవారికి అద్దెకు ఇవ్వడం వంటి పరిస్థితులు ఎప్పటి నుంచో ఉన్నాయి. గతంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీసు శాఖలు సంయుక్తంగా చర్యలు తీసుకుని, ఆక్రమణలను తొలగించినా మూడునాళ్ల ముచ్చటే అయ్యింది. తిరిగి యథావిధిగా మునుపటి పరిస్థితి కొనసాగుతోంది. ట్రాఫిక్ సమస్యను అధికారులు విన్నవిస్తే.. ఒక కానిస్టేబుల్‌ను ఉంచుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా అచ్చంపేట మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

మోతాదులోనే ఎరువుల వినియోగం

నకరికల్లు: వరి నాట్లు చదరపు మీటరుకు 44 కుదుళ్ల ఉండేలా వేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరా వరి పంటకు 72 కేజీల నత్రజని, 36 కేజీల భాస్వరం, 24 కేజీల పొటాష్ ఎరువులను వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.దాసయ్య, ఎంపీడీఓ కె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కాలువలో పడి వృద్ధురాలి మృతి



అత్తోట పూర్ణమ్మ మృతదేహం

నాదెండ్ల: ప్రమాదవశాత్తు కాలుజారి సాగర్ కాల్వలో పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సాతులూరు సమీపంలోని పెదనందిపాడు మేజర్‌కాలువ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై జి.పుల్లారావు కథనం ప్రకారం.. కాలువలో వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలు పొనుగుపాడు గ్రామానికి చెందిన అత్తోట పూర్ణమ్మ (75)గా గుర్తించారు. ఆమెకు నలుగురు కుమార్తెలు. భర్త, ముగ్గురు కుమార్తెలు కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. మూడో కుమార్తె సీతమ్మ వద్ద పొనుగుపాడు గ్రామంలో నివశిస్తోంది. ఆస్తమాతో బాధపడుతున్న పూర్ణమ్మ శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఆసుపత్రికి వెళ్ళేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. అయితే కాలువలో నీరు తాగే క్రమంలో కాలుజారి పడిపోయి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమార్తె సీతమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గ్రామస్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిసినట్లు కాకతీయ యూత్ ప్రతినిధి చెరుకూరి బాలకృష్ణ తెలిపారు. మొదట బహుమతి కాకతీయ యూత్ రూ.100.116 నగదు షీల్డ్, రెండవ బహుమతి 2018-19 పదోవ పూర్వ విద్యార్థులు బ్యాచ్ రూ.7116 , మూడోవ బహుమతి పవన్‌ఈజం రూ.5116 విజేతలకు అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధికారి జాలాది ఉషా, నల్లమాటి వెంకటేశ్, చెరుకూరి చౌదరి, హనుమంతరావు, రామాంజనేయులు, కోటిలింగం, చెవల వెంకట కృష్ణయ్య, కాకాని వేణు పాల్గొన్నారు.

బ్యాంక్‌కు రాకుండానే రుణం పొందొచ్చు

చిలకలూరిపేట ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సురేష్‌కుమార్



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సురేష్‌కుమార్

చిలకలూరిపేటటౌన్: ఆన్‌లైన్ ద్వారానే ఇకపై రూ.5 కోట్ల వరకు రుణాలు పొందే సరికొత్త పథకం ఎస్‌బీఐ ప్రవేశపెట్టిందని బ్యాంక్ చిలకలూరిపేట శాఖ చీఫ్ మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎన్ఆర్‌టి సెంటర్లోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో కస్టమర్లకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్‌టీ, సీజీఎస్టీ సకాలంలో చెల్లింపు చేస్తూ అప్‌డేట్‌లో ఉన్న ఖాతాదారులకు రుణాల కోసం బ్యాంకు రావల్సిన అవసరం లేదన్నారు. ఎస్‌బీఐ నూతనంగా ప్రవేశ పెట్టిన 'బీఆర్ఈ' అనే కొత్త పథకం ద్వారా రూ.5 కోట్ల వరకు సులభంగా రుణాన్ని పొందవచ్చన్నారు. ఈ రుణాన్ని పొందాలనుకునే వారు తమ వివరాలను ఈ పథకం వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే జీఎస్టీ, సీజీఎస్టీలకు సంబంధించిన అన్నింటినీ వాటంతట అవే జనరేట్ చేసి.. రుణం మంజూరు ఎంత చేస్తున్న సమాచారం సైతం లబ్ధిదారుడికి నేరుగా అందుతుందన్నారు. ఇంటి వద్దనే ఉండి ఎటువంటి వ్యాపారాలకైనా ఈ కొత్త పథకం ద్వారా రుణాలు పొందవన్నారు. అలాగే సూక్ష్మ పరిశ్రమలు, పెట్రోల్‌బంక్, ఫుడ్‌కోర్టులు వ్యాపారం ఏదైనా తమబ్యాంకు రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రూ.10 లక్షల వరకు ఎలాంటి హామీ లేకుండా తమశాఖ ఇస్తున్నట్లు వివరించారు. వ్యాపార, పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే ఆసక్తి కలిగిన వారంతా తప్పక ఆయా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఖాతాదారులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీస్తే ఒట్టు!

- బొల్లాపల్లి గ్రామాల్లో అపారిశుధ్యం
- ప్రబలుతున్న అంటువ్యాధులు



:బొల్లాపల్లిలో నిండిన సైడ్ కాలువ



వెల్లటూరు సైడ్ కాలువలు దుస్థితి

బొల్లాపల్లి: గ్రామాల్లో పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైంది. డ్రెయినేజీ సక్రమంగా లేక మురుగు కాలువలు నిండి దుర్వాసన వెదజల్లుతుంది. సైడ్ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టక, మరమ్మతులు చేయకపోవడంతో మురుగునీరు వీధుల్లోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. మండలంలోని వెల్లటూరు, మేళ్లవాగు, బొల్లాపల్లి, గంగులపాలెం తదితర గ్రామాల్లో సైడ్‌కాలువలు నిండటంతో మురుగునీరు రహదారులపై ప్రవహిస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతూ దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మురుగునీటి ప్రభావంతో వ్యాధుల బారిన పడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకున్న దాఖలు లేవు.
ఈ క్రమంలో రాత్రి సమయాల్లో అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సంబంధిత శాఖలు సైడ్ కాలువలు పూడిక తీత పనులు చేపట్టి మరమ్మతులు చేయాలని, దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు గంగాదేవీ తిరునాళ్లకు వేలం పాటలు

క్రోసూరు: అచ్చపేట మండలం ఓర్వకల్లు గ్రామంలోని గంగాదేవీ పేరాంటళమ్మ ఆలయ తిరునాళ్ల ఫిబ్రవరి 12న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన లైసెన్సు హక్కుల వేలం పాట శనివారం నిర్వహిస్తున్నట్లు ఈవో ఎం.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో క్రోసూరులోని వీరభద్ర మల్లికార్జునస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. తిరుణాళ్ల ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు, నెల పొంగళ్ల మార్చి 13 నుంచి 15వ తేదీ వరకు ఈ లైసెన్సులు పొందుతారని తెలిపారు.

వైభవంగా పునీత అంతోని చర్చి తిరునాళ్ల



తురకపాలెం(ముప్పాళ్ల): తురకపాలెం గ్రామంలోని పునీత ఆంతోని చర్చి 122వ వార్షిక తిరునాళ్ల శుక్రవారం వైభవంగా జరిగింది. చర్చిని విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. ఆలయ విచారణ గురువు నాగోతు చిన్నయ్య దివ్య పూజ నిర్వహించారు. అనంతరం సమష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. విచారణ గురువులు జోజి రాయన్న, మల్లవరపు సుందరబాబుతో పాటు మరో పది మంది గురువులు పాల్గొన్నారు. నాగోతు శౌరిరాజు ఫాదర్‌గా 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జూబిలీ వేడుకలు నిర్వహించారు. కొవ్వొత్తుల సమర్పణ చేశారు. సాయంత్రం తేరు ఊరేగింపు వేడుకగా జరిగింది. గ్రామ సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్ ప్రతాప్ చిన్నారులకు బహుమతులు అందించారు.